# అనగనగా ఒకరోజు...

-నామని సుజనాదేవి

రైలు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నట్లు కూతపెట్టింది. భార్య ఉమను కూపేలోకి ఎక్కించి కిటికీ నుండి మాట్లాడుతూ-

"చెబితే వినవుకదా. నీ మొండిపట్టు నీదే. ఒక్కదానివి రాజస్థాన్ నుండి చెన్నై ఎలా వెడతావు? ఆవిడ ఎలాగూ మరో నాలుగురోజుల్లో చనిపోయేదే. అప్పుడే వెడితే అయిపోయేదిగా. చెబితే అర్థంకాదు...జాగ్రత్త" అన్నాడు గణేష్ కోపంగా.

అప్పటికి స్టేషన్‌కి వచ్చిన దగ్గర్నుండి పదోసారి అతనలా ఆమెపై విరుచుకుపడడం. నిట్టూర్చింది ఉమ.

తోబుట్టువు అక్కడ మృత్యువుకు చేరువలో తమతో బంధాలన్నీ తెంచుకునే పరిస్థితిలో వుంటే వెళ్లి తానేమీ చేయలేకపోవచ్చుగానీ అలా అనుకుని దూరంగా ఉండగలదా? ఆత్మీయులంతా ఒకచోట ఉండి బాధని పంచుకుంటే కొంత తగ్గుతుంది. చనిపోయాక వెళ్లమనడం ఎంత కర్కశం? ఛీ...ఛీ...!

రైలు వేగం పుంజుకుంటుంటే చేయి ఊపింది ఉమ. అక్కడేమైనా అవసరం వస్తుందేమోనని భర్తకు తెలియకుండా తెస్తున్న పర్సులోని ఇరవైవేల రూపాయలను మరోసారి తడిమి చూసుకుంది. తాను ఉద్యోగం చేస్తుంది కాబట్టి ఈ కాస్తయినా ఆర్థిక స్వాతంత్ర్యం ఉంది.

లేకుంటేనా...అమ్మో తలచుకోవడానికే భయపడింది. కిటికీ నుండి బయటకు చూస్తూ వెనక్కు వెడుతున్న చెట్లు చేమలను చూస్తూ ఆలోచనల్లో పడింది.

పెళ్లయిన దగ్గర నుండి అతనితో తాను సుఖపడింది లేదు. ఎప్పుడూ వాళ్ల అమ్మ, అక్కలు, వారి పిల్లలు తప్పితే తనెప్పుడూ వాళ్లింట్లో పనిమనిషిలానే తప్ప మరోలా గుర్తించబడలేదు.

మనసులో మాటలు పంచుకోవాలనుకున్నా అతను వారితోనే తప్ప తనతో ఆత్మీయంగా మాట్లాడిందేలేదు. ఇక అతనే తనతో అలా ప్రవర్తిస్తే ఇంట్లో వారు ఇంతకన్నా మంచిగా ప్రవర్తిస్తారనేది కలలోని మాట.

అసలాయన తనకి గౌరవం, విలువ, ప్రేమ, అభిమానం ఇస్తేనేగదా వేరెవరైనా ఇవ్వడానికి? పెళ్లయి నాలుగు సంవత్సరాలైనా పిల్లలు కలగలేదని తన దగ్గర సణుగుతుంది అత్తయ్య. డాక్టర్ దగ్గరకు వెళితే తన దగ్గరేం తప్పు లేదన్నారు. ఆయనకు కూడా పరీక్ష చేయాలి తీసుకురమ్మన్నారు. కానీ ఆయన ససేమిరా రారు. పరీక్షకు ఒప్పుకోరు. అత్తయ్యేమో పూజలు, ఉపవాసాలు చేయాలంటారు. తనకు తెలుసు అసలు తప్పు ఆయన దగ్గరుందని. దానిని కప్పివుచ్చుకోవడానికి తననే ఏదో ఒకటి అంటుంటారు.

ఏం మాట్లాడాలన్నా భయమే. వారందరి సమక్షం తనకు ఊపిరాడనట్లు ఉంటుంది. ఇంత కాలం అందరూ వరంగల్‌లోనే ఉన్నారు. గత రెండునెలల క్రింద ఆయనకు ఉద్యోగరీత్యా రాజస్థాన్ ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆయన, తను అక్కడకు వెళ్లిపోయారు.

అయినా రోజూ ఆయన ఫోన్ చేస్తూ సలహాలు తీసుకుంటూనే ఉంటారు. తానేమీ సమిష్టి కుటుంబానికి వ్యతిరేకి కాదు. చాలా ఇష్టపడుతుంది అందరూ కలసి ఉండడాన్ని. కానీ మాట మాటకు, ప్రతీ చిన్నపనికి తప్పును వెదికి సహనాన్ని పరీక్షించేలా మాట్లాడే వారి ధోరణిని జీర్ణించుకోలేకపోతోంది.

అక్క మాధవికి బ్రెన్ కాన్సర్ వచ్చి అమ్మా వాళ్లు, అక్కా, బావా వాళ్లు చాలా బాధపడుతున్నారు. గత కొద్దికాలంగా అది చాలా ఎక్కువ అయింది. నిన్న నాన్న ఫోన్ చేసి 'అక్క కోమాలో వుంది. కేవలం రోజులే అన్నారు డాక్టర్లు' అని ఏడ్చారు.

ఈ విషయం విన్నాక తన ప్రాణం ఎలా నిలుస్తుంది? కనీసం అక్క కడగంటి చూపుకైనా నోచుకోవద్దా తాను. చిన్నప్పుడు ఎన్ని ఆడలాడుకున్నారు. ఎన్ని కలలు కన్నారు. బావ చాలా మంచివాడు. ఇప్పటికే ట్రీట్‌మెంట్ కోసం లక్షలు ఖర్చుపెట్టాడు. ఏం లాభం?

డాక్టర్లు ఎప్పుడో చెప్పారు 'బ్రతికే కాలాన్ని కొంచెం పొడిగించగలమేగానీ పూర్తిగా నయం చేయలేమని'. బావను చూస్తే బాధనిపిస్తుంది. కనీసం ఓదార్పు మాటలైనా మాట్లాడవద్దా. ఏకంగా చనిపోయాక వెళ్లమన్నాడు భర్త. ఎంత కర్కశత్వం. తనే కనుక ఇలా వుంటే 'ఎంత డబ్బులు పోసినా పోయేదేకదా? దానికింత ఖర్చెందుకు?' అని పొద్దున చనిపోగానే పాతరేసేవారేమో!

ఇప్పుడు వెళతానని తాను పట్టుబట్టేసరికి ఆయనకు సెలవు దొరకలేదని వద్దన్నారు. సెలవు దొరికినా ఆయన రారని, సెలవు దొరకకపోవడం కేవలం ఉత్తిమాటనేననీ తనకు తెలుసు. అందుకే ధైర్యం చేసి ఒక్కదాన్నయినా వెళతానని పట్టుబట్టి వచ్చింది.

కనీసం ఏడ్చే అమ్మానాన్నలను, బావను, అక్క పిల్లలను సముదాయించడానికి, మోరల్ సపోర్ట్ ఇవ్వడానికి. తెలిసాక తాను వెళ్లకుండా ఎలా ఉండగలదు?

అయినా ఆప్యాయతలు, అనురాగాలు ఆయనకేం తెలుసు? భార్య అంటే కేవలం వేరే ఇంటి నుండి, జీవిత కాలం ఎన్నో సమకూర్చడానికి వచ్చే జీతం లేని పనిమనిషి అనే తెలుసు. ఏనాడైనా ఏవైనా అనుభూతులు తనతో పంచుకున్నారా? ప్రేమగా ప్రవర్తించారా? అసలు పెళ్లి అనగానే ఎన్ని మధురోహలతో అడుగుపెట్టింది అత్తవారింట్లోకి. ఎన్ని ఆశలు, ఎన్ని ఊహలు... అన్నీ ఆయన ప్రవర్తన తన మనసులో చేసిన గాయానికి పేకమేడల్లా కూలిపోయాయి. వద్దనుకున్నా కళ్ల నుండి నీళ్లు ఉబికుబికి వస్తున్నాయి ఆమెకు.

"బెహన్‌జీ! క్యూం రోరహేహో... క్యాహువా?" ఎదురు సీట్లో కూర్చున్న ఇద్దరు యువకుల్లో ఒక యువకుడు అడుగుతున్నాడు.

అప్పటికిగానీ తెలీలేదు ఉమకు తనకు తెలియకుండానే తన కళ్ళు వర్షిస్తున్నాయని. తల అడ్డంగా ఏమీ లేదన్నట్లు ఊపుతూ కన్నీళ్లు తుడుచుకుంది. కానీ కన్నీళ్ల ప్రవాహాన్ని మాత్రం ఆపలేకపోయింది. కాసేపయ్యాక మాటల్లోకి దించి మళ్లీ అడిగారు

వాళ్లు.

పొడి పొడి మాటలతో సమాధానమిచ్చింది. ఆ కూపేలో తన పక్క సీట్లో ఉన్నవాళ్లు, అటువైపు ఉన్నవాళ్లు అందరూ మలయాళీలలా ఉన్నారు. అందరూ ఒకే కుటుంబంలా ఉన్నారు. అర్థంకాని వారి భాషలో వారు మాట్లాడుకుంటున్నారు. తన ఎదురుగా ఉన్న ఇద్దరు యువకులు స్వచ్ఛమైన హిందీలో మాట్లాడుతున్నారు.


వేషభాషలు వారు మర్యాదస్తులని తెలియజేస్తున్నాయి. వారిని వారు పరిచయం చేసుకుని ఎన్నో స్వాంతన వచవాలతో ప్రయత్నించిన మీదట పెదవి విప్పింది ఉమ. ఆమెకూ మనసులోని బాధ ఎవరితోనైనా పంచుకుని స్వాంతన పొందానుకుంది. అక్క చావు బ్రతుకుల్లో ఉంటే ఊరడించాల్సిన భర్త ఇంకొంచెం బాధను ఎక్కువ చేసాడు.

అందుకే వేగిపోతున్న మనస్సు, వారి మాటలతో కొంత ఊరట చెందింది. కష్టాలు మనుషులకు కాక మరొకరికి వస్తాయా? అప్పుడే ధైర్యంగా ఉండాలి. మీ బాధ చెప్పండి. మీ తోబుట్టిన వాళ్లనుకుని చెప్పండి. మేం తీర్చలేకపోయినా మీ బాధ తగ్గుతుందని ఎంతో ఊరడించిన మీదట మాట్లాడింది ఉమ.

అక్కకు ఆరోగ్యం బాగాలేదని, చావు బ్రతుకుల మధ్య ఉందని తాను అక్కడికే వెళుతున్నానని, అందుకే బాధనిపించిందని చెప్పింది.

"చిన్న వయసులోనే ఏమిటీ బాధ?" అంటూ అడిగారు మళ్లీ.

అన్నింటికీ వారు బెహన్‌జీ అన్నారు కాబట్టి భయ్యా అనే సంబోధిస్తూ మాట్లాడింది ఉమ.



బ్రైన్ కాన్సర్ గురించి చెబితే వారు వారికి తెలిసిన కేసుల గురించి చెప్పారు.

మాటల్లో మాటగా, రైలు వరంగల్‌వరకే కదా చెన్నై ఎలా వెళతారని వారడిగితే కాజీపేటలో తెల్లవారి అంటే ప్రొద్దున దిగితే అక్కడ ఆడబడుచు, అత్తయ్యవాళ్లు రిసీవ్ చేసుకుంటారని, ఆ రాత్రి చెన్నై వెళతానని చెప్పింది.

ఎలాగూ చాలా సుదూర ప్రయాణం కనుక ఒకరి తోడు ఒకరికి అవసరం, మరీ తను ఒక్కర్తీ అంటే కనీసం టాయ్‌లెట్‌కి వెళితే కూడా సామాన్లు కనిపెట్టడానికి ఒకరు అవసరం,

అందుకే తను మాట కలిపింది. రైలు ఎక్కిన దగ్గరనుంచీ అందరు అన్నీ తింటున్నా ఉమ మాత్రం మనస్సు బాగాలేక ఏమీ తినలేదు. మలయాళీ కుటుంబంవారు వారి గోల వారిదే అన్నట్లు గొడవ గొడవగా ఏదో మాట్లాడుకుంటున్నారేతప్ప ప్రక్కవారిని పట్టించుకోవడంలేదు.

ఆ యువకులు కూడా మంచివారిలా ఉన్నారు. చాలా మర్యాదగా ప్రవర్తిస్తున్నారు.

వారి వెంట తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు తింటూ ఉమను కూడా తినమంటూ బలవంతపెట్టారు.

తాను తెచ్చుకుందనీ, అయినా తినాలనిపించడంలేదని మృదువుగా తిరస్కరించింది. కానీ వారు ఊరుకోలేదు.

బయట నుండి ఏమైనా తేవాలా అంటూ అడిగారు. వారి అభిమానానికి సంతోషమనిపించినా వద్దంది. తరువాత మధ్యాహ్నం మూడుగంటలకు వారు తెచ్చుకున్న ఫ్లాస్క్‌లోని టీ వారు తాగుతూ ఆమెకిస్తే మాత్రం కాదనలేకపోయింది.

ఇక రాత్రికి వారు తింటూ ఆమెను ఎంత తినమన్నా తినకపోవడంతో, 'ఇలా అయితే మీ ఆరోగ్యం ఏం కావాలి? కనీసం మీ అక్కను చూడడానికి మీకు ఓపిక అయినా ఉండాలిగా. మీరలా ఉంటే మేం ఊర్కోం' అంటూ బలవంతాన బిస్కెట్ పాకెట్, టీని మళ్లీ ఇచ్చారు. వారు చూపే అభిమానానికి కళ్లల్లో నీళ్లొచ్చాయి.

'థాంక్యూ భయ్యా' అంటూ వారు విడిచేలా లేరని, తనకి కూడా తీసుకొచ్చుకున్న బాక్స్ తినాలనిపించక వారన్న మాటలు కూడా సబబుగానే ఉండడంతో టీలో ముంచుకుని బిస్కెట్స్ తిని టీ తాగింది. వారితో మాట్లాడుతూ మలయాళీ కుటుంబంవారు దిగడానికో ఏమో హడావుడి పడుతూ సర్దుకుంటున్నారు.

తినగానే నిద్ర ముంచుకొచ్చింది. ఆమె ప్రమేయం లేకుండానే మత్తుగా నిద్రపోయింది.

★★★

ఆమెకు మెలకువ వచ్చేసరికి హాస్పిటల్‌లో బెడ్‌పైన వుంది. ఒకవైపు చేతికి గ్లూకోజ్ ఎక్కుతోంది.

కనురెప్పలు బరువుగా ఉన్నాయి. కళ్ళు బలవంతాన తెరవగానే డాక్టర్, ఆడబడుచు, అత్తయ్య, పోలీసులు కనిపించారు.

'ఎలా వుంది?' అంటూ అత్తయ్య, 'ఏం జరిగింది?' అంటూ పోలీసులు అడుగుతున్నారు.

ఏమీ అర్థంకాలేదు ఉమకు. అంతా అయోమయంగా ఉంది. ఆలోచించడానికి మెదడు సహకరించడంలేదు. మత్తుగా ఉంది. కళ్లు మూసుకుపోతున్నాయి.

ఇంకా నిద్రపోవాలనిపిస్తోంది. ఏమైనా చెప్పడానికి, ఆలోచించడానికి మెదడు, శరీరం ఏదీ సహకరించడంలేదు. మత్తుగా నిద్రపోవాలనిపిస్తోంది.

డాక్టర్ 'దయచేసి ఆమెకు కొంచెం విశ్రాంతి ఇవ్వండి' అంటున్నాడు.

మాటలు అలా లీలగా వినబడుతుండగా మళ్లీ కళ్లు మూతలు పడ్డాయి.


ఒకరోజంతా అలా మత్తులోనే ఉంది ఉమ. మెలకువ వచ్చాక తెలిసిన విషయం ఏమిటంటే ఎదురుగా ఉన్న యువకులు తనకు మత్తుమందిచ్చి బిస్కెట్లు, టీని ఇచ్చారని, దానితో తాను స్పృహలో లేకపోతే తన దగ్గరున్న డబ్బు, మెళ్లో గొలుసు, చేతికివున్న గాజులు, తన బ్యాగ్ అన్నీ తీసుకుని తనను కాజీపేట స్టేషన్‌లో చివర ఒక చెట్టుకు ఆనించి కూర్చోబెట్టి వెళ్లారని, తనను రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన ఆడబడుచు రైలు వచ్చి వెళ్లినా తన జాడ ఎంతకూ కానరాకపోయేసరికి వెదుకుతూ ప్లాట్‌ఫాం చివర చెట్టు దగ్గర తనను చూసి తన అవతారానికి ఆశ్చర్యపోయి భయంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిందనీ, వారి సహాయంతో స్ట్రెచర్‌పై హాస్పిటల్‌లో చేర్చారని, చేర్చి ఇప్పటికి రెండురోజులయిందని, మనుష్యులపై వున్న నమ్మకం ఆమెకు ఈ సంఘటనతో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

★★★



## ప్రతిబింబం

కొన్నాళ్ళు పోతే గానీ మనకున్న టాలెంట్ ఏంటో బయటికి రాదు. ఇన్నాళ్లుగా చిత్రాల్లో నటిస్తున్నా బాలనటుడి స్థాయి నుంచి యూత్‌హీరోగా మారినా తాను నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని భావించినట్టున్నాడు తరుణ్. ఇప్పుడు ఫిల్మ్‌మేకింగ్‌లో 18 నెలలపాటు శిక్షణ పొందేందుకు గాను తరుణ్ లండన్ వెళ్లాడు. ఈ శిక్షణ పూర్తిచేసుకుని వచ్చి మళ్లీ కొత్త చిత్రాల్లో నటిస్తానని చెబుతున్నాడు. అతను నేర్చుకున్న విషయాలు కొత్త చిత్రంలో ప్రతిబింబిస్తాయేమో చూడాలి మరి.



ఆ నాలుగురోజులూ పోలీసుల ఇన్వెస్టిగేషన్లు, అత్తయ్య, ఆడబడుచుల ఆరాలు, ఫోన్లో భర్త ఈసడింపులు, డబ్బు తీసుకెళ్లిన విషయం తెలిసి తిట్లు... అన్నీ బ్రతుకుపై విరక్తిని కలుగజేసాయి.

ఈ మత్తు నుండి, షాక్ నుండి తేరుకోకముందే అక్క చనిపోయిందన్న వార్త తెలిసింది.

గుండెల్ని పిండినట్లయింది. అంతకన్నా విరక్తి కలిగే సంఘటన తరువాత జరిగింది.

"డబ్బులు పర్సులో పెట్టుకుని అన్నీ వెయ్యిరూపాయల నోట్లే కనుక జాకెట్ లోపల పెట్టుకున్నానని'' ఉన్న విషయం ఉన్నట్లుగా చెప్పింది ఉమ పోలీసులకు.

భర్త తరువాత ఫోనులో మాట్లాడుతూ "చేతిగాజులు, కాలిపట్టాలు, బాగ్ తోపాటు జాకెట్ లోపల వేసుకున్న మంగళసూత్రం గొలుసు, డబ్బులు అన్నీ తీసుకెళ్లారు వాళ్లు. అంటే వారు జాకెట్ లోపల చూసారు. పైగా నిన్ను చెట్టు దగ్గర కూర్చోబెట్టినప్పుడు రేగిన జుట్టు, చెదిరిన బొట్టు, అస్తవ్యస్తమైన బట్టలతో ఉన్నావు. కనుక వారింకేమైనా చేసారేమో? అసలు నిన్ను అనాలి. ఎవరితోనైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడతావు. ఎవరేమిస్తే అది తింటావా'' ఇంకా అలా మాట్లాడుతుంటే అప్రయత్నంగా రిసీవర్ వదిలేసింది. ఊహించని షాక్‌కు లోనైంది.

తరువాత ఆడబడుచువాళ్ళు "గణేష్ చెబితే డాక్టర్లతో చెప్పి ఆ టెస్టు కూడా చేయించాము ఏమయినా అయిందేమోనని. ఇంకా నయం...ఏమీకా లేదు'' అంటుంటే అసహ్యమేసింది ఉమకు.

మానసిక ధైర్యమిచ్చి అండగా నిలవాల్సిన భర్త, సూటిపోటి మాటలతో మనస్సు నొప్పించడమే కాకుండా టెస్టు చేయించామని ఎంతో మామూలు విషయంలా చెబితే జీర్ణించుకోలేకపోతోంది. అసలు అంత నమ్మకం లేనిది, ఇకముందు అతనితో కాపురం ఎలా చేయగలుగుతుంది? ఇంతకాలం ఎన్నిరకాలుగా బాధపెట్టినా ఈ విషయాలతో అమ్మానాన్నలకు బాధపెట్టలేక, ఈ వయసులో వారిని కష్టపెట్టడం ఇష్టంలేక ఏమీ చెప్పలేదు. మనస్సుకే సర్ది చెప్పుకుంది.

ఇప్పుడు అణువణువునా అతనిపట్ల అసహ్యం పేరుకుపోయింది. అక్క చనిపోవడంతో అన్యమనస్కంగానే చెన్నై వెళ్లింది. కానీ మనస్సంతా విరక్తిగా, నిర్వేదంగా మారిపోయింది.

***

అక్క చనిపోయిన పదవరోజున తనను తీసుకెళ్లడానికి వచ్చిన భర్త, అక్క పోయిన దుఃఖంలో ఎలా వున్నావని అడగడం మరచి, "వీరనారిలా బయల్దేరావు. ఎవడు పడితే వాడితో రాసుకుపూసుకు మాట్లాడతావా? ఛీ...ఛీ... అంతా మా కాలేజీలో, 'ఇలా జరిగిందట కదా' అంటూ పేపర్లలో చూసి అడిగితే తలెత్తుకోలేకపోయాను. వాళ్లు నీ శరీరంలో ఇంకా వేటి వేటిని ముట్టుకున్నారో...'' ఇలా మాట్లాడుతుంటే ఇంక ఆవేశాన్ని ఆపుకోలేకపోయింది.

"ఇంక ఆపండి...ఛీ... మీరు మనుష్యులేనా? అక్కపోయిన దుఃఖంలో వున్నవారిని ఓదార్చాల్సిన విధానం ఇదేనా? నేను ముందే చెప్పాను, నేను బాధలో ఉంటే వాళ్ళు బెహన్‌జీ అంటూ మాట్లాడుతుంటే మంచివాళ్లనుకున్నాను. ఏమీ తినలేదని టీ ఇస్తే తాగాను. ఏమీ కాలేదుకదా, అదే అభిమానంతో ఇస్తున్నారని మళ్లీ టీ తాగాను. అంతే! దాన్ని ఇంత ఘోరంగా చిత్రీకరించుకున్నారు. అనుక్షణం చిత్రవధ చేసే మీతో ఇకముందు సంసారం కూడా చేయలేను. ఏదో నాకోసం మీరు త్యాగం చేస్తున్నట్లు ఉదారంగా, నన్ను ఏలుకోనక్కర్లేదు. ఇప్పుడే విడాకులకు అప్లై చేస్తాను. గుడ్‌బై'' అంటూ చరచరా వెళ్లిపోయింది ఉమ.

ఊరకమైన తిరుగుబాటును ఊహించని గణేష్ నిశ్చేష్టుడయ్యాడు.

ఎప్పటిలా ఎన్ని మాటలన్నా వాళ్ల అమ్మానాన్నల కోసమైనా తనను బ్రతిమిలాడి, తన తప్పును క్షమించమంటుందని, తాను ఉదార స్వభావుడిలా చేరదీస్తున్నట్లు ఫోజు కొట్టవచ్చని ఆశపడ్డాడు.

ఎందుకంటే ప్రతినెలా ఆమె తెచ్చే జీతం విడాకులైతే రాదు. పైగా కోర్టు భరణం ఇవ్వమంటుంది. మళ్లీ పెళ్లి చేసుకోవాలన్నా ఇంతటి అందగత్తె, విద్యావంతురాలు, గుణవంతురాలు, ఉద్యోగస్తురాలు తనకు దొరకదు. తనకు పిల్లలు పుట్టే యోగంలేదు.

కనుక తన తప్పుకు చెంపలేసుకుని ఇకనుండైనా ఆమెను నొప్పించవద్దని నిర్ణయించుకుని ప్రాధేయపడి ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి ఆమెను వెదుకుతూ బయల్దేరాడు గణేష్.

కానీ అలనాటి 'క్షమయా ధరిత్రి'లా నేటి మహిళ క్షమిస్తుందా?

★

## రోడ్లు లేకపోయినా కార్లున్నాయి

గురుగాంకి 15.కి.మీ దూరంలో ఉల్లావాస్, మైదావాస్, ఖాదర్‌పూర్, తిక్రి, బాద్షాపూర్ గ్రామాలలో ఇటీవల మాస్టర్ ప్లాన్-21 ధర్మమా అని లాండ్ డెవలపర్స్ దిగిపోయారు. రైతులు వ్యవసాయం మానేసి ఆ పొలాన్ని యూనిటెక్, అన్సల్స్ వంటి బిగ్ బిల్డర్స్‌కి ఎకరానికి 3-4 కోట్లు చొప్పున అమ్మేస్తున్నారు. గత ఆరునెలల్లో భూమి ధరలు నాలుగువందల శాతం పెరిగాయిట. గతంలో పెంకుటిళ్లు ఉంటే గొప్ప. ఇప్పుడు ఎక్కడ చూసినా రెండు అంతస్థుల మేడలు. ఏ ఊళ్లోనూ సరైన రోడ్లులేవు. కరెంటు, నీటి పరిస్థితి ఘోరంగా ఉంది. కానీ ఊరి నిండా ఎక్కడ చూసినా వివిధ రకాల కార్లు. ఒక విధంగా చెప్పాలంటే ఆ ఊళ్లల్లో ఇప్పుడు కారు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ఒకానొక్కప్పుడు చరిత్రకెక్కిన గూండాలున్న ఆ గ్రామాల చుట్టూతా గోధుమ, ఆవ పొలాలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు? ఎక్కడ చూసినా బిల్డింగ్ మెటీరియల్. దేశ ప్రగతి అంటే ఇదేనా? నీళ్లు, కరెంటు లేని కాంక్రీటు జంగిల్స్‌లో నివశించడమా?

## కలలుకనే మనిషి

మనిషి తన జీవిత కాలంలో 1,36,000 కలలు కంటాడట. ఆ కలల వ్యవధిని కలిపితే మొత్తం ఆరేళ్లుంటుందని ఒక అంచనా.

-తటవర్తి

